
సాక్షి
కాకినాడ
శుక్రవారం । 15 । మార్చి । 2024



అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అన్నదాన భవనానికి పెద్దు మిధున్ చక్రవర్తి, ఉషా కిరణ్ దంపతులు (రాజమహేంద్రవరం) గురువారం రూ.లక్ష విరాళం అందించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సెహరీ శని (ఉ॥)
రాజమహేంద్రవరం	6.21	4.50
కాకినాడ	6.21	4.50
అమలాపురం	6.21	4.50

న్యూస్‌రీల్

ప్రసాదం స్టాల్ ప్రారంభోత్సవం వాయిదా

అన్నవరం: స్థానిక జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపాన విశాఖపట్నం – రాజమహేంద్రవరం వైపు ఉన్న దేవస్థానం స్థలంలో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం వద్ద స్వామివారి ప్రసాదం స్టాల్ ప్రారంభోత్సవం వాయిదా పడింది. దీనిని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించాల్సి ఉంది. ఆయనకు అదే రోజు ఇతర కార్యక్రమాలు ఉండటంతో ప్రారంభోత్సవం వాయిదా వేశామని దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ గురువారం తెలిపారు.

కేంద్రీయ విద్యాలయలో రేపు ఇంటర్వ్యూలు

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలోని కాకినాడ కేంద్రీయ విద్యాలయలో వివిధ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ బి.శేఖర్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సోషల్ స్టడీస్, కంప్యూటర్స్, సైన్స్, ఇంగ్లిషు, సంస్కృతం, హిందీ, నర్స్, స్పోర్ట్స్ కోచ్, కౌన్సిలర్ తదితర పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 8.30 గంటలకు తమ విద్యాలయ వద్దకు రావాలని సూచించారు. అర్హత, జీతం తదితర వివరాలు విద్యాలయ వెబ్‌సైట్ www.kakinada.kvs.ac.inలో చూడవచ్చని తెలిపారు.

జిల్లా సహకార అధికారిగా వెంకటకృష్ణ



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నంద్యాల జిల్లా సహకార ఆడిట్ అధికారిగా పని చేస్తూ, స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందిన జి.వెంకటకృష్ణ జిల్లా సహకార అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జి జిల్లా సహకార అధికారిగా పని చేసిన దుర్గాప్రసాద్ కాకినాడ డివిజన్ సహకార అధికారిగా కొనసాగుతున్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శంఖవరం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ)లో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.బాల మణికుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయటి పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బాలికలు మాత్రమే దీనికి అర్హులన్నారు. దరఖాస్తులనే అడ్మిషన్లుగా పరిశీలిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్‌లో మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఎంపీసీలో 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చే నెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా బసవా అశోక్



కాకినాడ: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా బసవా అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ గురువారం ఉత్తర్వులు అందజేశారు. కాకినాడకు చెందిన మాజీ కార్పొరేటర్ బసవా చంద్రమౌళి కుమారుడైన అశోక్ వైఎస్సార్ సీపీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన కృషికి గాను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సిఫారసు మేరకు మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో ఈ నియామకాన్ని ప్రకటించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఆరుగురికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆరుగురికి కలెక్టర్ కృతికా శుక్లా గురువారం కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఐదుగురికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఒకరికి ఆఫీసు సబార్డినేట్‌గా ఉద్యోగాలు కల్పించారు. కారుణ్య నియామకాలు పొందిన వారికి అభినందనలు తెలిపి, అంకిత భావంతో విధులు నిర్వహించి, కెరీర్ పరంగా మంచి అవకాశాలు అందుకోవాలని సూచించారు.

తల్లులకు ఆరోగ్య రక్ష

- పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన
- 23 వరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్షోత్సవాలు
- పోషకాహార లోప నివారణే లక్ష్యం

కాకినాడ సిటీ: ఆరోగ్యకర సమాజమే లక్ష్యంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు కల్పించింది. నూతన భవనాలు నిర్మించింది. నాలుగేళ్లలో దాదాపు 2,244 మందికి పైగా వైద్యులను, వైద్య సిబ్బందిని కొత్తగా నియమించింది. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను కూడా బలోపేతం చేసింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేస్తోంది. ప్రజా సంక్షేమం, ఆరోగ్యకర సమాజమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోంది. ముఖ్యంగా గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలనిస్తోంది. 10 రకాల పోషకాహార పదార్థాలతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు అందిస్తోంది. దీంతోపాటు గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న మేలుపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 23వ తేదీ వరకూ పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 9న ప్రారంభమైన ఈ పక్షోత్సవాలను పురస్కరించుకుని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పోషకాహార ప్రాధాన్యంపై అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అందిస్తున్న పోషకాహారం ఇదీ..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు 3 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, అర కిలో వంట నూనె, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, 2 కిలోల రాగి పిండి, కేజీ అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో చిక్కీ, పావు కిలో ఖర్జూరాన్ని కిట్ రూపంలో ప్రతి నెలా అందిస్తున్నారు.
- పిల్లలకు రెండున్నర కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందిస్తున్నారు.
- జిల్లాలో 1986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో బాలింతలు 11,518 మంది, గర్భిణులు 13,134 మంది ఉన్నారు. అలాగే, ఏడు నెలల నుంచి మూడో సంవత్సరం వరకూ వయస్సు ఉన్న పిల్లలు 62,170 మంది, 3 నుంచి ఆరేళ్ల వయస్సు పిల్లలు 29,728 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లుపంపిణీ చేస్తున్నారు.



చిరుధాన్యాలు, పోషకాహార ప్రాధాన్యంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు (ఫైల్)



పక్షోత్సవాల నిర్వహణ ఇలా..

- పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజుకో కార్యక్రమం నిర్వహిస్తూ గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు.
- చిరుధాన్యాల ప్రాధాన్యం, చిరుధాన్యాల వంటకాల ప్రదర్శన.
- చేతులు శుభ్రంగా కడగడం వలన కలిగే లాభాలు.
- పోషకాహార లోపంపై అవగాహన కార్యక్రమాలు.
- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) అందించడం.
- ఖేల్ ఔర్ పఢో ఈవెంట్ ఏర్పాటు
- వంటల పోటీలు.
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించడం.
- రక్తహీనతతో బాధ పడుతున్న గర్భిణుల గుర్తింపు, నిరంతర వైద్య పరీక్షలపై అవగాహన.
- ప్రీ స్కూల్‌లో తల్లిదండ్రుల ప్రమేయాన్ని వివరించడం.
- ఆరోగ్య శిబిరాలు, నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ.
- స్వచ్ఛత దినోత్సవం, బొమ్మల తయారీ.
- గర్భిణులకు యోగాపై అవగాహన.

అన్ని సౌకర్యాలూ బాగున్నాయి



అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ బాగున్నాయి. గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ఇస్తున్నారు. ఈ సరకులు ఎంతో పోషక విలువలతో కూడుకుని ఉన్నాయి. అన్ని విషయాలపై అవగాహన కల్పించటంతో పాటు అనారోగ్య సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు సూచిస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారు.

– పినపోతు సంగీత, దాశెట్టి తేజస్విని, తూరంగి, కాకినాడ

పోషకాహారం మేలును వివరిస్తున్నాం



అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం. పోషకాహారం వలన ఆరోగ్యానికి కలిగే మేలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను వివరిస్తున్నాం. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నాం. స్థానికంగా లభించే దినుసులతో మంచి పోషకాహారం తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్నాం.

– కె.ప్రవీణ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి, కాకినాడ

గ్లకోమాకు జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు



గ్లకోమా ప్రత్యేక విభాగాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా కాకినాడ ప్రభుత్వాస్పత్రి(జీజీహెచ్)లో ప్రత్యేక గ్లకోమా సేవల విభాగాన్ని ప్రారంభించారు. కంటి వైద్య విభాగంలో ఏర్పాటు చేసిన ఈ విభాగాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎంపీఆర్ విఠల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ ఎస్.రమాభారతి మాట్లాడుతూ, ప్రాథమిక దశలో గ్లకోమాను గుర్తించడం ద్వారా కంటిచూపు కోల్పోకుండా నిలువరించవచ్చని అన్నారు. 40 ఏళ్లు పైబడిన వ్యక్తులు తరచూ కంటి అద్దాలు మార్చాల్సి రావడం, వెలుతురు చుట్టూ రంగుల వలయం కనిపించడం, తరచూ తలనొప్పి, కంటి ఎరుపు, వాంతులు, కనుగుడ్డు నొప్పి గ్లకోమా లక్షణాలని వివరించారు. 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ గ్లకోమా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. జీజీహెచ్‌లో ఈ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని డాక్టర్ రమాభారతి తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ పుష్కరరావు, డీసీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ

కాకినాడ సిటీ: రోడ్లు, భవనాల (ఆర్‌అండ్‌బీ) శాఖ ఎస్‌ఈగా నియమితులైన జి.కాంతు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాంతు ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డెప్యూటేషన్‌పై పని చేస్తూ బదిలీపై కాకినాడ ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా వచ్చారు.

ఈబీసీ నేస్తం నిధుల జమ



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

- 9,516 మందికి లబ్ధి
- రూ.14.27 కోట్ల అందజేత
- కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడి

కాకినాడ సిటీ: వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన పేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లిలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడో విడత నిధులు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడారు. ఈబీసీ నేస్తం పథకం కింద జిల్లాలోని వివిధ అగ్రవర్ణాలకు చెందిన 9,516 మంది పేద మహిళలకు ప్రభుత్వం రూ.14.27 కోట్ల ఆర్థిక సాయం అందించిందని తెలిపారు. రెడ్డి, కమ్మ, క్షత్రియ, బ్రాహ్మణ, వెలమ ఇతర ఓసీ కులాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాల పేద మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. దీని ద్వారా ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈబీసీ నేస్తం కింద జిల్లాలో 2021–22లో 8,883 మందికి రూ.13.32 కోట్లు, 2022–23లో 9,995 మందికి రూ.14.99 కోట్లు, ఈ ఏడాది 9,516 మందికి రూ.14.27 కోట్ల చొప్పున నిధులు అందించిందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎస్సీ, పెరిక కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు పెదపాటి అమ్మాజీ, పురుషోత్తం గంగాభవాని, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జిల్లా వెనుకబడిన సేవా సహకార సంఘం ఈడీ ఎ.శ్రీనివాసరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అతిథులు ఈబీసీ నేస్తం నమూనా చెక్కు అందజేశారు.

టీడీఆర్ జారీపై బురద రాతలు

- అవాస్తవాలతో మభ్యపెట్టేందుకు ఈనాడు యత్నం
- తప్పుడు సమాచారంతో కథనం



కాకినాడ: విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం, ఇతర అవసరాల కోసం టీడీఆర్ బాండ్లు జారీ చేయడం ద్వారా నగరపాలక సంస్థలో చేసిన స్థల సేకరణపై 'ఈనాడు' దినపత్రిక అవాస్తవ కథనాలు, అభూతకల్పనలతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు మరోసారి ప్రయత్నించింది. అవాస్తవాలను వండివార్చడంలో అందె వేసిన సదరు పత్రిక.. తప్పుడు సమాచారంతో ఈ నెల 10న 'టీడీఆర్... టెర్రర్' పేరిట మరో కథనాన్ని ప్రచురించింది. ప్రజావసరాల కోసం పీవీఆర్ ఇండస్ట్రీస్ నుంచి 4.67 ఎకరాలు సేకరించగా.. ఆ భూమిలో 1.32 ఎకరాలు మాత్రమే పీవీఆర్ ఇండస్ట్రీస్‌కు చెందినదని, మిగిలిన ప్రభుత్వ భూమిని ఆ సంస్థ కలిపేసుకుని కోట్లాది రూపాయల పరిహారం పొందిందని, ఇందుకు నగరపాలక సంస్థతో పాటు వివిధ శాఖల అధికారులు వత్తాసు పలికారన్నది ఆ కథనం సారాంశం. కానీ, వాస్తవానికి పీవీఆర్ ఇండస్ట్రీస్ సంస్థ దుమ్ములపేట ప్రాంతంలో 2007లో డాక్యుమెంట్ నంబర్ 11547లో 2 ఎకరాల 7 సెంట్లు, 11548లో ఎకరం 30 సెంట్లు, 11549లో 30 సెంట్ల చొప్పున కొనుగోలు చేసింది. ఆ మేరకు టీడీఆర్ బాండ్లు మూడు భాగాలుగా ఇవ్వాలంటూ రాతపూర్వకంగా కోరడంతో అలాగే జారీ చేశారు. అయితే ఒక డాక్యుమెంట్ సమాచారం మాత్రమే తెలుసుకున్న ఆ పత్రిక మిగిలిన రెండు డాక్యుమెంట్లు పక్కన పెట్టేసి, అక్కడ అంతా గోల్‌మాల్ జరిగిపోయిందంటూ ఆరోపణలు గుప్పించేసింది. మార్కెట్ రేటు రూ.17 వేలు ఉండగా రూ.28 వేలు చెల్లించేశారంటూ మరో ఆరోపణ కూడా చేసింది. నిజానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన టీడీఆర్ బాండ్ల జారీ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఇప్పుడు కూడా బాండ్లు జారీ చేశారు. జిల్లా రిజిస్ట్రార్ నిర్ణయించి సిఫారసు చేసిన ధర మేరకే టీడీఆర్ కమిటీ ఉన్నతాధికారులకు నివేదించి ప్రభుత్వ ఆమోదం మేరకు విడుదల చేశారు. దీనిపై కూడా రాజకీయ ప్రత్యర్థులకు ప్రయోజనం కలిగేలా తప్పుడు కథనాలతో ఆ పత్రిక తన వైఖరిని మరోసారి బహిర్గతం చేసుకుంది. ఇది చాలదన్నట్టు ఏసీబీ, విజిలెన్స్ విభాగాలు దృష్టి పెట్టాయని, విచారణ చేస్తున్నాయంటూ మరో తప్పుడు సమాచారాన్ని కూడా ఆ కథనంలో పేర్కొంది. అయితే, ఇక్కడ అటువంటి విచారణ ఏదీ జరగలేదని కాకినాడ నగరపాలక సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.


టీడీఆర్.. టెర్రర్
అసలేం జరిగిందంటే..

అసత్యాలతో ఈనాడు వండి వార్చిన కథనం

ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టాలి

- నగదు, మద్యం, తాయిలాల పంపిణీపై పటిష్ట నిఘా
- అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం

కాకినాడ సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నగదు, మద్యం, ఇతర ప్రలోభాల పంపిణీని సమర్థంగా అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వేలెన్స్ టీములు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్న వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, ఓటర్లకు నగదు, మద్యం, బహుమతుల పంపిణీ వంటి ప్రలోభాలను అరికట్టాలని అధికారులను కోరారు. ఇందుకు వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల మధ్య పరస్పర సమన్వయానికి ఎన్నికల కమిషన్ రూపొందించిన ఆన్‌లైన్ ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్)లో పోలీసు, ప్రొహిబిషన్, ఇన్‌కంట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్, రవాణా, స్టేట్ ఆడిట్, అటవీ శాఖ, ఎస్ఈబీ, కోస్ట్‌గార్డ్, బ్యాంకుల నోడల్ అధికారులు విధిగా నమోదు కావాలని ఆదేశించారు. తమ శాఖల పరిధిలో ఎన్నికలకు సంబంధించిన అక్రమ, అనుమానాస్పద కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయా అంశాలపై ఎన్నికల కంట్రోల్ రూముకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, తనకు రోజువారీ నివేదికలు పంపాలని చెప్పారు. అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు తమ విభాగాల్లో క్విక్ రెస్పాన్స్ టీములు, ర్యాపిడ్ యాక్షన్ టీములు ఏర్పాటు చేసి, తగు శిక్షణ ఇవ్వాలని, వాటిని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వేలెన్స్ టీములతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. రూ.లక్షకు మించి జరిగే సందేహాస్పద లావాదేవీలు, ఒకే అకౌంట్ నుంచి వివిధ ఖాతాలకు అసాధారణ రీతిలో జరిగే లావాదేవీల సమాచారాన్ని బ్యాంకులు విధిగా ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. రూ.10 లక్షలకు మించి జరిగే లావాదేవీలపై ఇన్‌కమ్‌ట్యాక్స్ శాఖకు తెలియజేయాలని సూచించారు. మద్యం డిపోల్లో జరిగే విక్రయాలను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎలక్షన్ సెంట్రల్ కంట్రోల్ రూము పరిశీలనకు అనుసంధానం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ జేఎస్‌వీ భాస్కరరావు, డీఎఫ్ఓ ఎస్.భరణి, ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారి పి.రామ్‌కుమార్, స్టేట్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ జి.సుమతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, జిల్లా ఆడిట్ అధికారి వై.సురేష్ బాబు, పే అండ్ అకౌంట్స్ అధికారి షేక్ జిలాని, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేవీడీ ప్రసాద్, సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జీఎస్ నాయుడు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్, పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, కోస్ట్‌గార్డ్ డిప్యూటీ కమాండెంట్ ఎన్.అరుణ్‌కుమార్, యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

రోడ్డు ప్రమాదాలు తగ్గాయి

జిల్లాలో చేపట్టిన రహదారి భద్రతా కార్యక్రమాల ద్వారా గత ఏడాది రోడ్డు ప్రమాదాలు 20 శాతం, ప్రమాద మరణాలు 15 శాతం మేర తగ్గాయని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వివిధ శాఖల సమన్వయంతో రహదారులను సురక్షితంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు. జాతీయ రహదారి–16పై గుర్తించిన 46, జాతీయ రహదారి–216పై గుర్తించిన 40 బ్లాక్‌స్పాట్‌లను ప్రమాద రహితంగా చేసేందుకు చేపట్టిన చర్యలపై సమీక్షించారు. కాకినాడ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న 14 జంక్షన్ల అభివృద్ధి, సిగ్నల్ లైటింగ్ ఏర్పాటుపై ఆదేశాలు జారీ చేశారు. గుడ్ సమరిటన్ లా కింద ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులను సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ జేఎస్‌వీ భాస్కరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి.కాంతు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్, నేషనల్ హైవేల ప్రాజెక్టు డైరెక్టర్లు డి.సురేంద్రనాథ్, బి.సాయి శ్రీనివాస్, డీఎంహెచ్ఓ జె.నరసింహ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ పాండురంగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

జిల్లాలో ఎన్నికల పరిశీలకుల బస, పర్యటనలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని లైజాన్ అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. ఈ అంశంపై గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గుర్తించిన అతిథి గృహాల్లో అన్ని సదుపాయాలూ కల్పించాలని, ఫోన్, కంప్యూటర్లు, కంప్యూటర్ ఆపరేటర్, సహాయక సిబ్బంది, వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే అధికారుల ఆహార అలవాట్లకు అనుగుణమైన భోజన ఏర్పాట్లు చేయాలని, అందుకు తగిన వంట మనుషులను నియమించాలని అన్నారు. సమావేశంలో డీఆర్ఓ డి.తిప్పే నాయక్, సీపీఓ పి.త్రినాథ్, ఆర్‌అండ్‌బీ ఈఈ టి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చక్కగా రాస్తే మార్కులు

- టెన్త్ విద్యార్థులకు నిపుణుల సూచనలు
- పరీక్షలకు సిద్ధమవుతున్న 83,491 మంది



రాయవరం: విద్యార్థుల్లో ఇప్పటికే 'టెన్షన్' మొదలైంది. మరో మూడు రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు అనగానే తెలియని ఆందోళన. తెలిసిన సమాధానాలే అయినా వాటిని పేపరుపై ఎలా ప్రజెంట్ చేయాలో తెలియక కొందరు సతమతమవుతారు. తరగతి గదిలో టక్కున జవాబులు చెప్పే కొందరు విద్యార్థులు మార్కుల సాధనలో మాత్రం వెనుకబడి ఉంటారు. బాగా వచ్చిన సమాధానాలను సరైన రీతిలో రాయలేక పోవడమే ఇందుకు కారణం. చిన్న అవరోధాన్ని అధిగమిస్తే విజయం వారి సొంతం. ఈ నెల 18వ తేదీ నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 83,491 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో సాధారణంగా చేసే చిన్న చిన్న పొరపాట్లు, వాటిని సరిదిద్దుకోవలసిన తీరు, పరీక్షల్లో రాయడంలో మెళకువలు, సూచనలు విద్యార్థుల కోసం..

ప్రజెంటేషన్ కీలకం

ఏడాది మొత్తం చదివింది ఒక ఎత్తైతే పరీక్షల్లో ఎలా ప్రజెంట్ చేశామనేది చాలా కీలకం. సంవత్సరం పాటు చదివిన విషయాలను మూడు గంటల్లో పరీక్ష పత్రంపై ఎలా పెట్టాలన్నదే విద్యార్థులను తొలిచే ప్రశ్న. ఒక్కోసారి సమాధానాలు తెలిసినా విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని సమగ్రంగా రాయలేక పోతారు. అలాకాకుండా జవాబులను సూటిగా రాయాలి. సమాధానాలు టీచరుకు తెలిసిన విద్యార్థి గుర్తించాలి. మనం రాసే తీరు పరీక్ష పేపరు వేల్యూయేషన్ చేసే వారిని ఇబ్బంది పెట్టేలా ఉండరాదు. వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి. చేతిరాత గుండ్రంగా, అర్థమయ్యేలా ఉండాలి.

మార్కుల సాధనలో దస్తూరీ కీలకమే

ఓ విద్యార్థి చేతిరాతను బట్టి సంబంధిత విషయంపై అతని అవగాహన స్థాయిని చెప్పవచ్చు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎంత తెలివైన వారైనా జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేవారికి తెలియదు. వారు రాసే తీరు, అక్షరాల కూర్పును బట్టి వారి జ్ఞానాన్ని అంచనా వేస్తారు. ఈ విషయంలో చేతిరాతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. క్లాసు ఇంపుగా కన్పించే అక్షరాలు..అందమైన దస్తూరి చూసే వారిని ఇట్టే ఆకట్టుకుంటాయి. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేవారి మనసుకు హత్తుకుని మార్కులు వేసేలా ప్రేరేపిస్తుంది. పరీక్షలో విజేతగా నిలుపుతుంది.

ఉమ్మడి జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
కాకినాడ	16,121	16,141	32,262
తూర్పుగోదావరి	15,819	14,297	30,116
కోనసీమ	10,871	10,242	21,113

ఇలా రాస్తే మంచిది..

ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకున్నాకే రాయాలి. సమాధాన పత్రంలో పేజీకి 15–16 లైన్లు ఉండాలి. పేజీకి పైన, కింద మార్జిన్ విడిచి పెట్టాలి. మొదటి వరసలో ఎంత వరకు రాశారో చివరి వరకు అదే దస్తూరిని కొనసాగించాలి. వాక్యాలు చక్కగా ఉండేలా చూసుకోవాలి. తెలుగు, ఆంగ్లం, హిందీలోని లెటర్ రైటింగ్‌ను ఒకే పేజీలో వచ్చేలా రాయాలి. అక్షర దోషాలు దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలి. గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గిస్తారు. ఇచ్చిన సమస్యను అర్థం చేసుకున్న తర్వాత రాయడం ప్రారంభించాలి. గ్రాఫ్‌ను చక్కగా గీయాలి. సైన్స్‌లో బొమ్మలు గీసేటప్పుడు కచ్చితమైన వాటిని వరుసక్రమంలో ఉన్నవాటిని ఆకర్షణీయంగా గీయాలి. సాంఘిక శాస్త్రం సబ్జెక్టు సమాధానాలను పాయింట్లు వారీగా రాయాలి. మ్యాప్‌లో అడిగిన వాటిని స్పష్టంగా గుర్తించాలి. శీర్షికలు, ఉపశీర్షికల కింద అండర్‌లైన్ చేయాలి. మంచి పెన్నులు ఉపయోగించాలి. బిట్లు రాసేటప్పుడు కొట్టివేతలు రాకుండా చూసుకోవాలి.

సూటిగా చేసే పాయింట్లే..

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25–30 లైన్లు రాస్తారు. గజిబిజిగా, దగ్గరదగ్గరగా ఉండడంతో జవాబుపత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కో పేజీలో 16–18 లైన్లకు మించకుండా చూడాలి. ఒక పాయింట్ దగ్గర మొదలైన రాత ఆ లైను చివరికి వెళ్లే సరికి పైకో కిందకో పోతుంది. దాంతో ఆ పేజీల్లో అన్ని లైన్లు గజిబిజిగా మారతాయి. లైన్లు సమాంతరంగా ఉండేలా చూడాలి. ప్రశ్న సంఖ్యలు జవాబులో ముఖ్యమైన పాయింట్లకు ఇచ్చే సంఖ్యలు మార్జిన్‌లో ఒక దాని కింద మరొకటి వేయవద్దు. గీత చివర వరకూ రాస్తూ చివరికి వెళ్లగానే అక్కడ సగం పదం రాసి..మరో సగాన్ని కింద లైనులో రాస్తుంటారు. దీంతో దిద్దే వారికి ఆ పూర్తి పదం ఏంటో అర్థం కాదు. సాధ్యమైనంత వరకు పదాలను ఒక లైనులోనే వచ్చేలా రాయాలి. చాలా మంది విద్యార్థులు బాగా ఒత్తిపెట్టి రాస్తుంటారు. కలాన్ని వేళ్లతో బిగుతుగా పట్టుకుంటారు. దీంతో పేజీ రెండో వైపు ఆ అక్షరాలు కన్పిస్తూ చివరికి జవాబు పత్రాలు గజిబిజిగా తయారవుతాయి. పైగా విద్యార్థులకు కూడా రాయడం మొదలు పెట్టిన కొద్ది సేపటికే వేళ్ల నొప్పి పెడతాయి. చాలా మంది విద్యార్థులు అంకెలను సరిగా రాయరు. '2' అంకెను ఇంగ్లిష్ జెడ్ తరహాలో, '5'ను ఎస్‌లా '0'ను 6 తరహాలో రాసేస్తుంటారు. ఫలితంగా రావలసిన మార్కులు తగ్గిపోతాయి. చాలామంది విద్యార్థులు ఇంగ్లిష్ 'ఎ'పై చుక్క 'జె' అక్షరంపై గీత వేయరు. తెలుగులో ణ, మ, య, సరిగా రాయరు. పరీక్ష పత్రంలో ఏవైనా తప్పులు రాస్తే వాటిని పెన్సిల్ లేదా పెన్నుతో బాగా రుద్దుతారు. దీంతో పేపరంతా నల్లగా మారుతుంది. స్కెచ్ పెన్సిల్‌లు, పలు రంగుల రీఫిల్స్‌ను అడ్డదిడ్డంగా ఉపయోగిస్తుంటారు. ఇది మంచిది కాదు. అవసరమైన చోటనే ఉపయోగిస్తే అందంగా ఉంటుందని గుర్తించాలి. సైన్స్‌లో బొమ్మల్ని గీస్తే ఆ చిత్రంలోని భాగాల్ని గుర్తించడంలో ఒక క్రమ పద్ధతి పాటించాలి.

మూల్యాంకనపై ప్రభావం



అందమైన దస్తూరి మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేస్తుంది. చాలా మంది కష్టపడి చదువుతారు కానీ బాగా రాయక పోవడంతో అనుకున్న మార్కులు సాధించలేక పోతున్నారు. చదివిన విషయాన్ని పేపరుపై ప్రజెంటేషన్ చేయడం కూడా ప్రధానమైన అంశంగా చెప్పవచ్చు.

– సిహెచ్ పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు(ఎఫ్‌ఏసీ), జెడ్పీహెచ్ఎస్, ద్రాక్షారామ, రామచంద్రపురం మండలం

మెరుగైన ప్రతిభ కనబర్చాలి



సమాధానాలు రాసే సమయంలో తప్పులు, కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. అలాగని దస్తూరి సరిగ్గా లేనివారు ఆందోళన పడాల్సిన పనిలేదు. సమాధానాలు అర్థమయ్యేలా చూసుకోవాలి. పరీక్షల్లో ఉన్నంతలో మెరుగ్గా రాసే ప్రయత్నం చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– బీఆర్ కామేశ్వరరావు, హెచ్ఎం, ఎంజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, అమలాపురం

క్లుప్తంగా

పంట కాలువలు, లాకుల పరిశీలన



పి.గన్నవరంలో అక్విడెక్టును పరిశీలిస్తున్న రంగస్వామి

పి.గన్నవరం: డెల్టా ఇరిగేషన్ సిస్టంలో పంట కాలువలు, లాకుల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) మెంబర్ సెక్రటరీ రంగస్వామి అలగేషన్ అన్నారు. రెండు రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న సెంట్రల్, వెస్టర్న్ డెల్టాల పరిధిలోని 10 లాకులను, పంట కాలువలను ఆయన పరిశీలించారు. గురువారం సాయంత్రం పి.గన్నవరంలోని కొత్త, పాత అక్విడెక్టులను, కొత్త అక్విడెక్టు కాలువలో ఫ్లై ప్రాటెక్షన్ గేట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పలుచోట్ల లాకుల్లో ఇనుప గేట్లు, షట్టర్లు తుప్పు పడుతున్నాయని, కాలువల్లో పూడిక, తూడు పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నదని వివరించారు. గేట్లు, షట్టర్లు తుప్పు పట్టకుండా రిపేరు చేసి పెయింట్లు వేయాలని అన్నారు. ఆయన వెంట జీఆర్ఎంబీ ఉన్నతాధికారులు పంపుతామని రంగస్వామి తెలిపారు. ఆయన వెంట ఈఈ వెంకటస్వామి, పి.గన్నవరం, నర్సాపురం ఇరిగేషన్ డీఈఈలు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, స్థానిక ఏఈ సుందరసింగ్ ఉన్నారు.

ఫిజియో థెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సమగ్ర శిక్ష పరిధిలో ఉన్న మండల భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఐదు ఫిజియో థెరపిస్టు పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు తెలిపారు. ఫిజియోథెరపిస్టు బీపీటీ, ఎంపీటీ కోర్సులు చేసినవారు ఈ పోస్టులకు అర్హులు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా ముమ్మిడివరంలోని తమ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని ఆయన సూచించారు.

రూ. 9లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ప్రత్తిపాడు: లారీలో అక్రమంగా తరలిస్తున్న 176 కేజీల గంజాయిని జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద గురువారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ-సెబ్) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జె.రవికుమార్ స్థానిక సెబ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. లారీలో గంజాయి తరలుతున్నట్లు జిల్లా అధికారులకు సమాచారం అందడంతో ప్రత్తిపాడు సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తన సిబ్బందితో జాతీయ రహదారిపై గస్తీ నిర్వహించారు. తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీని కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ దాటిన తర్వాత అదుపులోకి తీసుకుని, తనిఖీ చేపట్టారు. లారీ అడుగు భాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో 84 గంజాయి ప్యాకెట్లను కనుగొన్నారు. ఈ ప్యాకెట్లలో ఉన్న రూ.9 లక్షల విలువ గల 176 కేజీల గంజాయిని, లారీని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పాడిపల్లి చంద్రయ్యను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జె.రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ పీఎస్ దొర, ప్రత్తిపాడు, కాకినాడ సౌత్ సెబ్ సీఐలు ఎల్.చిరంజీవి, ఆర్.జయరామ్ సతీష్, ఎస్సై ఎం.ఆశాలత పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లతో సూపరింటెండెంట్ రవికుమార్, సిబ్బంది

ఐక్యతే శెట్టిబలిజ కులస్తుల బలం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- శెట్టిబలిజ సంఘానికి 630 గజాల స్థలం అప్పగింత
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ప్రజాప్రతినిధులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు. చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: ఐక్యతే శెట్టిబలిజ కులస్తుల బలమని రాష్ట్ర సమాచార పౌరసంబంధ, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కాలనీ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన 630 చదరపు గజాల స్థలాన్ని గురువారం అప్పగించారు. మంత్రి వేణు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శెట్టిబలిజ సామాజిక వర్గానికి పెద్దపీట వేశారన్నారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలుగా చట్టసభల్లో మరే రాజకీయ పార్టీ కల్పించనంత ప్రాధాన్యాన్ని శెట్టిబలిజలకు ఇచ్చారన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం బాబాసాహెబ్ అంబేడ్కర్, పూలే వంటి మహనీయుల స్ఫూర్తితో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు జగన్ ఎంతో శ్రమించారన్నారు. ఆయనను బీసీఎంను, కాకినాడలో శెట్టిబలిజ కులస్తులకు అగ్రపీఠం వేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కాకినాడలోని శెట్టిబలిజ సామాజిక వర్గంతో తనకు ఎంతో ఆత్మీయబంధం ఉందన్నారు. ఈ వర్గానికి రాజకీయంగాను, ఇతర అంశాల్లోనూ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ప్రధానంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి వేణు సహకారంతో స్థలం మంజూరైందని, ఇది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శెట్టిబలిజలకు మంత్రి పదవితో పాటు ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు కూడా కేటాయించి వారు ఆత్మస్థైర్యంతో స్థానంలో ఉండాలని ఆకాంక్షించిన సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సుమారు రూ.మూడున్నర కోట్ల వ్యయంతో కేటాయించిన స్థలంలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని కూడా ఎన్నికల అనంతరం పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి హామీ ఇచ్చారు. స్థలం మంజూరుకు సహకరించిన మంత్రి చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిలను శెట్టిబలిజ సామాజిక వర్గ ప్రతినిధులు గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొండ బాబు రెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, శెట్టిబలిజ సంఘం ప్రముఖులు గుబ్బల తులసీకుమార్, పితాని శ్రీనివాసరావు, గెద్దాడ వెంకటేశ్వరరావు, రెడ్డి రామవకులరావు, పితాని సూరరాజు పాల్గొన్నారు.


గీతాంజలి మృతికి కారకులైన దోషుల్ని శిక్షించాలి



పి.గన్నవరంలో జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శన

పి.గన్నవరం: తెనాలిలో గీతాంజలి మృతికి కారకులైన దోషుల్ని కఠినంగా శిక్షించాలని పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. గీతాంజలి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ విప్పర్తి ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక మూడు రోడ్ల సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చిందని ఎంతో ఆనందంగా చెప్పిన గీతాంజలిపై ప్రతిపక్ష సోషల్ మీడియా కక్షగట్టి ప్రాణాలను బలిగొందని ఆవేదన వ్యక్తం చేశారు. గీతాంజలిని వేధించి, ఆమె మరణానికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా సైకోలను ఆగడాలను అరికట్టాలని పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దానరి కాశీ, కొక్కిరి రవికుమార్, దొమ్మేటి సూర్య, అడ్డగళ్ల శ్రీను పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ముమ్మిడివరం: ఒకటేచోట చదివిన వీరంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 54 ఏళ్ల తర్వాత వారంతా మళ్లీ ఒక్కచోట చేరి సందడి చేశారు. ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1966–69లో ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివిన పూర్వ విద్యార్థుల గురువారం ఒక్కచోట చేరి సందడి చేశారు. అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకుని, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అప్పట్లో విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు కొర్ల సుబ్బారావు, పుల్లెల భీమశంకరం, చిట్టుకుల రామం, సిహెచ్ వీకే అంతర్వేదులను ఘనంగా సత్కరించారు.

50 ఏళ్ల తర్వాత గ్రామానికి వచ్చిన బేతవోలు



నల్లజర్లలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

నల్లజర్ల: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, భాషాసమ్మాన్ పురస్కారం, వైఎస్సార్ లైఫ్ అచీవ్ మెంట్ అవార్డు గ్రహీత, కళారత్న, సాహితీ సమున్నత శిఖరం, రచయిత, అనువాదకులు, అవధాని ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఆయన భార్య సర్వలక్ష్మి గురువారం నల్లజర్ల విచ్చేశారు. ఆయన ఇక్కడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత ఆయన ఇక్కడకు వచ్చారు. అలనాటి బాల్య స్మృతులను నెమరవేసుకున్నారు. బాల్యస్నేహితులు నిమ్మలపూడి వీరరాఘవులు, ముళ్లపూడి వెంకట లక్ష్మయ్య, గంటా కృష్ణ, దుగ్గిన గోపాలం తదితరులను కలుసుకున్నారు. తాను చదువుకున్న పాఠశాల, తిరుగాడిన గుడి, గోపురాలను సందర్శించారు. అల్లాడ రామయ్య కళ్యాణ మంటపంలో రామబ్రహ్మం దంపతులను నూతన వస్త్రాలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, అల్లాడ రామకృష్ణ, పాతూరి సత్యనారాయణ, వెల్లంకి రాఘవ, పాకలపాటి రాంబాబు తదితరులున్నారు. ఆయన శిష్యుడు అమరేంద్ర, హరిప్రియంక దంపతులను ఆశీర్వదించారు.

శునకాలు తరమడంతో విద్యార్థి మృతి



శివమోహనకృష్ణ (ఫైల్)

యానాం: శునకాల దాడి కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థి మృతిచెందిన ఘటన యానాంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో వంతాపాటి శివమోహనకృష్ణ(19) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం శివమోహనకృష్ణ తండ్రి వంతపాటి శ్రీనివాస్(గాంధీ) స్థానిక ఫైర్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గురువారం తెల్లవారు ఝామున ఆయన జెర్రి కుట్టడంతో కాలు తిమ్మిరిగా ఉందని, తనను ఆసుపత్రికి తీసుకువెళ్లాలని కుమారుడు శివమోహనకృష్ణను కోరారు. అతను బైక్‌పై తండ్రిని యానాం జీజీహెచ్‌కు తీసుకువెళ్లి ఇంజక్షన్ చేయించారు. తండ్రిని వైద్యులు కొంతసేపు ఆసుపత్రిలో ఉండాలని సూచించడంతో అక్కడే ఉంచేశాడు. పరిక్షలు ఉండటంతో చదువుకోవడానికి శివమోహనకృష్ణ ఒక్కడే బైక్‌పై ఇంటికి వస్తుండగా ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న కుక్కలు ఒక్కసారి దాడి చేశాయి. వాటినుంచి తప్పించబోయి ఫైర్‌స్టేషన్ గోడను బలంగా ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు యానాం జీజీహెచ్‌కు తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే శివమోహనకృష్ణ మృతిచెందాడు. మృతుడు శివమోహనకృష్ణ స్థానిక అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఈసీఈ ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తండ్రి శ్రీనివాస్, తల్లి బేబీ బోరున విలపించడం కలచివేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కల నిరోధానికి చర్యలు తీసుకోకపోవడంతోనే ఇటువంటి దారుణాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐఎఫ్ఓ భరణికి అభినందనలు



ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో శిఖరంపై జాతీయ పతకాన్ని ఎగురవేసిన ఐఎఫ్ఓ భరణి



ఐఎఫ్ఓ భరణికి ఘన స్వాగతం తెలుపుతున్న అటవీ శాఖ ఉద్యోగులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అటవీశాఖ అధికారిణి ఎస్.భరణి ఈ నెల 8వ తేదీన ఆఫ్రికా ఖండంలోని ఎత్తైన పర్వత శిఖరం కిలిమంజారో శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి జాతీయ పతకాన్ని ఎగురవేశారు. గురువారం ఆమె జిల్లాకు చేరుకోగా అటవీశాఖ సిబ్బంది ఘన స్వాగతం తెలిపి అభినందనలు అందించారు. ఈ సందర్భంగా భరణి మాట్లాడుతూ కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించడం చాలా గర్వంగా ఉందన్నారు. దేశ పతకాన్ని శిఖరంపై ఎగుర వేసిన క్షణం జీవితంలో మరచిపోలేనిదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని అని అన్నారు. తనకు స్వాగతం తెలిపిన సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

హాకీ క్రీడాకారులకు అభినందనలు



రాష్ట్ర స్థాయి పోటీలో విజయం సాధించిన జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఏలేటి ప్రకాశం జిల్లా మైదానపాడులో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా హాకీ పోటీలలో విజయం సాధించిన జిల్లా జట్టును గురువారం హాకీ కాకినాడ చీఫ్ ఛైర్మన్ రవిచంద్ర, హరీష్ అభినందించారు. గురువారం డీఎస్ఏలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఆయన పలు సూచనలు అందించారు. హాకీ కోచ్ రవిరాజు మాట్లాడుతూ జిల్లా నుంచి నలుగురు క్రీడాకారిణులను జాతీయస్థాయి పోటీలలో అవకాశం రావడం జిల్లాకు గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

వేట్లపాలెం సర్పంచ్ పదవి మూడు నెలల రద్దు



సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉప సర్పంచ్ శ్రీరామ్

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం సర్పంచ్ చిల్లి లక్ష్మి పదవిని మూడు నెలల పాటు రద్దు చేశారు. ఈ మేరకు ఈవోపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యనారాయణ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ నెల ఏడవ తేదీ నుంచి జూన్ ఆరో వరకు పదవిని రద్దు చేసామన్నారు. ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌ను ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ కృతికాశుక్లా ఉత్తర్వులు ఇచ్చారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉప సర్పంచ్, ఈఓపీఆర్డీకు చెక్కు పవర్ ఇచ్చారు. ఉప సర్పంచ్ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు.